ప్రజాశక్తి

గురువారం 5 జనవరి 2023 5 శ్రీ సత్యసాయి

జెఎన్‌టియులో 6న స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల, ఓటీపీఆర్ఐ కళాశాల, మేనేజ్‌మెంట్ కళాశాలలో మిగిలిన కన్వీనర్ కోటా సీట్లకు స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ అడ్మిషన్ బి.ఈశ్వర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు ఎపి పీజీ సెట్-2022, ఏపీఐ సెట్-2022లో అర్హత సాధించి సంబంధిత డిగ్రీ నందు ఉత్తీర్ణులైన వారు మాత్రమే ఈ కోర్సులకు అర్హులని తెలిపారు. అర్హత కలిగి ఆసక్తి గల విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను తీసుకుని 6వ తేదీ రావాలన్నారు. ప్రాసెసింగ్ ఫీజు-డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ పేరు మీద చెల్లించాల్సి ఉందన్నారు. సీటు పొందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజును ది రిజిస్ట్రార్ జేఎన్టీయూ ఏ పేరు మీద చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు జేఎన్టీయూ పరిపాలన భవనం వద్దకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు www.jntua.ac.in వెబ్ సైట్‌ను సందర్శించగలరు. స్పాట్ అడ్మిషన్ సీటు పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్ మెంట్‌కు అర్హులు కాదు తెలిపారు.

భూసేకరణను జాప్యం చేయొద్దు

జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వివిధ ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణలో ఎలాంటి జాప్యం చేయకుండా త్వరితగతిన ప్రక్రియను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టబోయే గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, 716జి, 342, 44 రహదారులు, ఏపీఐఐసీ, వివిధ రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియపై బుధవారం నాడు పుట్టపర్తి కలెక్టరేట్లో ఆర్డీవోలు, తహశీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి వెళ్లే గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, 716జి, 342, 44 జాతీయ రహదారులు, ఏపీఐఐసీ, వివిధ రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం చేయరాదన్నారు. ఒక ప్రాంతానికి ఒక ప్రభుత్వ ప్రాజెక్టు మంజూరు చేశారంటే ఆ ప్రాంతానికి ఆ ప్రాజెక్టు ఎంతో అవసరమై ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భూసేకరణ ప్రక్రియ ఆలస్యం చేయరాదన్నారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆయా మండలాల తహశీల్దార్లు దీనిపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా సకాలంలో భూసేకరణ పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవోలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, తహశీల్దార్‌లు, నేషనల్ హైవేస్, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి వదిలేశారు..!

రోడ్డు వేయడంపై నిర్లక్ష్యం - ఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ అధికారులు ఆక్రమణల తొలగింపు పేరుతో రైల్వే రోడ్డు, ధనలక్ష్మి రోడ్డులో గృహాలతో పాటు పలు వాణిజ్య భవనాలను ఇటీవల తొలగించరు. ఆక్రమణల తొలగింపు జరిగిన వెంటనే పురపాలక సంఘం సాధరణ నిధులతో రోడ్డుతో పాటు మురుగు కాలవలు నిర్మాణం చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా గత నెల ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమాలను కూడా చేశారు. భూమిపూజ చేసి నెల రోజులు కావస్తున్నా ఈ రోడ్డు, మరుగుకాలువల పనులు నేటికీ ప్రారంభం అవలేదు. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హిందూపురం పురపాలక సంఘంలో ప్రధాన రహదారులతో పాటు పట్టణ అంతర్గత రహదారులను సైతం కొంత మంది కబ్జాదారులు కబ్జాలు చేసుకుని నిర్మాణలు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు కాలువలు నిండి, మరుగు నీరు రోడ్డుపైకి రావాడంతో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకుని కొన్ని ప్రాంతాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో ఉన్న ఆక్రమణలను తొలగించారు.

రాళ్లు, మట్టితో దుర్భరంగా ఉన్న పట్టణంలోని డిఎల్ రోడ్డు

పూర్తిస్థాయిలో నిధులు లేక పోయినా పురపాలక సంఘం ఆదాయాన్ని పెంచుతూ సాధరణ నిధులతో అత్యవసరం కింద ప్రధాన రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. రూ. 21లక్షలతో ధనలక్ష్మి రోడ్డు (డిఎల్ రోడ్డు) సిమెంట్ రోడ్డు పనులు, రూ.12.50లక్షలతో మురుగు కాలువ నిర్మాణ పనులను గత నెల ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ చేతుల మీదుగా భూమిపూజతో ప్రారంభించారు. ఈ పనులు భూమిపూజతోనే ఆగిపోయాయి. ఆక్రమణల తొలగించిన వ్యర్థాలు మురుగు కాలుల్లో పడడంతో మురుగునీరు ముందుకు సాగక రోడ్డుపై పారుతోంది. దీంతో ఇక్కడున్న స్థానికులు, ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను తెలుపుదామంటే కమిషనర్ దీర్ఘకాలిక సెలవులో ఉండడంతో ఎవరికి చెప్పాలో తెలియక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధిని పరుగులు తీయిస్తామంటున్న పాలకులు తమకు ఏమి తెలియనట్లు భూమిపూజతో వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనులను పూర్తి చేస్తాం: డిఈఈ నీరజ

ధనలక్ష్మి రోడ్డులో ప్రారంభించిన సిమెంట్ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణ పనులను సంబంధిత గుత్తేదారులతో చర్చించి, వెంటనే పనులు ప్రారంభిస్తాం. త్వరతగితిన పనులు పూర్తి అయ్యే విధంగా చూస్తాం. దీంతో పాటు రైల్వేరోడ్డు పనులు సైతం త్వరలో ప్రారంభిస్తాం.

అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్నాం : ఎమ్మెల్యే

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఓబులదేవరచెరువు

అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఒక్కరకీ పింఛన్లను అందజేస్తున్నామని ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి తెలియజేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో వైఎస్సార్ పింఛను కానుక పెంపు, కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ఏ ఒక్కరికి దగ్గరకు వెళ్లకుండా కేవలం సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారి ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలా జరగలేదన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో కూడా జగన్‌కు ప్రజలు మద్దతునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ కోళ్ల కష్ణారెడ్డి, ఎంపిపి పర్వీన్ భాను, జడ్పిటిసి కుర్లి దామోదర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు గోవిందు, వెంకటరమణ, షాజియా మజీద్, పఠాన్ ఆబీద రఫిక్, జగన్మోహన్ చౌదరి, రంగారెడ్డి, రామ సుబ్బారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు నిసార్ అహ్మద్, షామీర్ బాషా, లక్ష్మి రెడ్డి, ఎంపీడీవో పోలప్ప, తహశీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ చేసిన డిఇఒ

సబ్జెక్టుపై విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న డిఇఒ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ మీనాక్షి బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలల పరిస్థితులపై విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పలు సబ్జెక్టులపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ఇందులో విద్యార్థులు సమాధానాలు చెప్పలేకపోవడంతో ఆమె ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇలా సమాధానాలు చెప్పలేకపోతే ఎలా అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పదవ తరగతి విద్యార్థులపై మరింత దృష్టి సారించి పాఠ్యాంశాలు బోధించాలని తెలియజేశారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయులు మరింత దృష్టి కేంద్రీకరించి వారిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

ప్రభుత్వ విద్యకు ప్రోత్సాహం

ఎమ్మెల్యే డా॥పివి.సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-నల్లచెరువు

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని ఎమ్మెల్యే డా॥పివి.సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబులను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ విద్యకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా అత్యాధునికమైన వసతులతో కూడిన పాఠశాలలను అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్పోరేట్ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా అన్ని సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలలోనే అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. పాఠశాల స్థాయిలోనే సాంకేతిక విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, జెడ్పీటీసీ విశ్వనాథ్‌రెడ్డి, వైస్ ఎంపిపి నారాయణస్వామి, సర్పంచి పంచరత్నమ్మ, సర్పంచులు యూసఫ్, హైటెక్ రమణ, రమణారెడ్డి, షమివుల్లా, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు దశరథరామయ్య నాయుడు, సింగల్ విండో అధ్యక్షులు జయచంద్రారెడ్డి, మాజీ సర్పంచి రవి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతులు మీదుగా ట్యాబ్‌లు తీసుకున్న విద్యార్థులు

కదిరిలో జీవో ప్రతులను దహనం చేస్తున్న అఖిలపక్షం నాయకులు

ప్రభుత్వ తీరుపై విపక్షాల ఆగ్రహం

జీవో నెం:1 ప్రతులు దహనం

ప్రజాశక్తి-కదిరి టౌన్

జాతీయ, మున్సిపల్, పంచాయతీ రోడ్లపై బహిరంగ సమావేశాలు, నిరసనలు రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 1పై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బుధవారం నాడు కదిరి పట్టణంలోని వేమారెడ్డి సర్కిల్‌లో జీవో:1 ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల మాచర్ల, గుంటూరు సంఘటనలను సాకుగా చూపి రాష్ట్ర ప్రభుత్వం నిరసనలు, ఆందోళనలపై ఉక్కుపాదం మోపేలా జీవో తీసుకురావడం అప్రజాస్వామికం అన్నారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ఈ హక్కును కాలరాసేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం జీవోలు తీసుకురావడం దుర్మార్గం అన్నారు. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలను పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంల్లో కూడా ఘటనలు జరుగుతున్నాయని, వీటికి ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. ఇలాంటి చీకటి జీవోలతో ప్రభుత్వం తన మనుగడనే కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఏకపక్షంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మోపురిశెట్టి చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి బండారు మనోహర్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇసాక్, ఎఐకెఎస్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్, రామ్మోహన్, నారాయణ, టిడిపి నాయకులు, తేపల్లె మనోహర్, రాజేంద్ర నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గుడాలగుంది రమణ పాల్గొన్నారు.

పెనుకొండ : సభలు, సమావేశాలు,రోడ్ షోలను నియంత్రిస్తూ చీకటి జీవోను తెచ్చిన వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిందని జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, పెనుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పార్థసారథి విమర్శించారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో జి.ఓ నెం: 1 కాపీలతో నిరసన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అర్ధరాత్రి విడుదల చేసిన జీవో నెం: 1 తో ప్రతిపక్ష రాజకీయ పార్టీ నాయకుల గొంతు నొక్కాలని చూస్తోందని విమర్శించారు. ఇలాంటి జీవోల వల్ల జగన్ రెడ్డి ప్రభుత్వం మరింతగా ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు రంగయ్య, జిల్లా టిడిపి అధికార ప్రతినిధులు రొద్దం నరసింహులు, రఘువీర చౌదరి, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ అధ్యక్షులు రవిశంకర్, రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి హుజూర్, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షుడు అంద్రూస్, జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గౌడ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోమాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జి,ఓ ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవ నాయుడు, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, అడదాకులపల్లి మాజీ సర్పంచి ప్రసాద్, త్రివేంద్ర నాయుడు, కౌన్సిలర్ గీతా హనుమంతు, బాలాజీ నాయక్, హరి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 1నివెంటనే ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన నాయకులు కలసి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతిపక్షాలు సభలు సమావేశాలు, ర్యాలీని నిర్వహించకుండా చేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. అర్ధరాత్రి జీవోలు తెచ్చి ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వ విధానం చూస్తుంటే అత్యవసర పరిస్థితి తలపించే విధంగా వ్యవహరిస్తోందన్నారు. తక్షణమే జీవోను ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గౌస్ లాజాం, పై పల్లి గంగాధర్, సిపిఐ నాయకులు ఆంజనేయులు, ఎఐటియు జిల్లా కార్యదర్శి బయన్న, జయలక్ష్మి, అరుణ్ కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, మహమ్మద్ రఫీ, జనసేన నాయకులు అబ్దుల్, తిరుపతేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో బ్రిటిష్ పాలన సాగుతోందని టీడీపీ నాయకులు విమర్శించారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ జగన్ పరిపాలన పిరికివంద చర్యలు భావిస్తున్నామన్నారు. ఇదంతా ప్రజలు గమనిసున్నారని రాబోయే రోజుల్లో తగిన బుద్ధిచెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్ చింతలపల్లి మహేశ్ చౌదరి చింతపులుసుపెదన్న, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్,రాంపురం శీన అంబటి సనత్ తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అఖిలపక్షం నాయకులు

ఎంఇఒ, హెచ్‌ఎం తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి బత్తలపల్లి

మండల విద్యాశాఖాధికారి, బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనుసరిస్తున్న వైఖరిపై సభ్యులు తీవ్రంగా విమర్శించారు. వీరు మండలానికే తలనొప్పిగా మాదారని వీరిని తక్షణం మండలం నుండి బదిలీ చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల సర్వసభ్యసమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తీర్మానం చేసి పంపనున్నట్లు ఎంపిపి గుర్రం వనజ, జెడ్పిటిసి కోటిసుధలు అన్నారు. ఎంపిపి గుర్రం వనజ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ ఎంఇఒ, స్థానిక జెడ్పీహెచ్ పాఠశాల హెచ్‌ఎం పనితీరు సరిగా లేదన్నారు. ఎమ్మెల్యే సైత హెచ్చరించినా వారు పద్ధతులు మార్చుకోలేదని అన్నారు. వీరిని బదిలీ చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు గజ్జల వెంగళరెడ్డి, సాకే పార్వతి, వైద్యాధికారిణి తేజశ్రీతో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అసైన్మెంట్ భూముల పంపిణీ

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

భూమిలేని నిరుపేదలకి ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ పంపిణీ పథకాన్ని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా త్వరలో భూ పంపిణీ జరుగుతుందని తహశీల్దార్ రవినాయక్ తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్ రవినాయక్ తహశీల్దార్‌కార్యాలయంలో తహశీల్దార్ రవి నాయక్ విఆర్‌ఓ ఆర్ ఐ, సర్వేలు, వీఆర్ఏలతో సమావేశం నిర్వహించారు. భూమికి సంబంధించిన అర్జీల్లో ప్రతి అర్జీని విశ్లేషంగా పరిశీలించి భూమి లేని నిరుపేదలకు త్వరలో గుర్తించి వారికి జాబితా అని తయారుచేయాలన్నారు.

అంధుల అక్షరశిల్పి లూయీస్ బ్రెయిలీ

ప్రజాశక్తి - హిందూపురం

అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని శ్రీ సత్య సాయి జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంధులకు వివిధ క్రీడ పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బుధవారం పట్టణంలోని ఎంజిఎం మైదానంలో సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, ఆంధ్రప్రదేశ్ వికలాంగుల వయోవద్దుల సంక్షేమ శాఖ ఛైర్‌పర్సన్ ముంతాజ్ పటాన్, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల వికలాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండ్ రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బ్రెయిలీ చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో దివ్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వేణుగోపాల్ రావు, ప్రభుత్వ అంధ ఆశ్రమ పాఠశాల సేవామందిర్ ప్రిన్సిపల్ కరీముల్లా, ఎమ్‌జిఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యం, శ్రీ సత్యసాయి జిల్లా విభిన్న ప్రతిభా వంతుల అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

ఓట్ల తొలగింపుపై విచారణ

ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న కేంద్రం ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, ఉరవకొండ

ఓట్ల తొలగింపు అంశంపై విచారణకు కేంద్ర ఎన్నికల ముఖ్య అధికారి అవినాశ్ కుమార్ బుధవారం నాడు జిల్లాకు విచ్చేశారు. ఢిల్లీ నుంచి బెంగళూరుకు విమానాశ్రయంలో వచ్చిన ఆయన నేరుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకున్నారు. అక్కడి అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉరవకొండ ఎమ్మెల్యే పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్ అవినాశ్ కుమార్‌ను కలసి ఓటర్ల తొలగింపు అంశంపై మరిన్ని వివరాలను అందజేశారు. అనంతరం ఎన్నికల అధికారి ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటించారు. ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్, విఆర్‌ఒలతో సమావేశమై ఓటర్ల జాబితాపై సమీక్ష జరిపారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తన నియోజకవర్గం పరిధిలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగినట్టు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఆధారాలతో వివరాలను అందజేశారు. విడపనకల్లు మండలంలోని చీకలగురికి గ్రామంలో కొంత మంది ఓటర్ల పేర్లను తొలగించినట్టు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్నికల సంఘం ముఖ్య అధికారి అవినాశ్ కుమార్ బుధవారం జిల్లాకు వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు సందర్భంగానూ కేశవ్ మరిన్ని ఆధారాలను చూపించినట్టు సమాచారం. గురువారం కూడా ఎన్నికల సంఘం అధికారి ఇక్కడే ఉండి విచారణ చేపట్టే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

అధికారుల్లో గుబులు

ఎన్నికల సంఘం అధికారులు నేరుగా రంగంలోకి దిగి విచారణ చేపట్టడంతో అధికారుల్లోనూ గుబులు మొదలైంది. ఇప్పటికే ఇద్దరు సిబ్బందిపై వేటు వేశారు. దీనిపై ఇతర ప్రాంతాల్లోనూ ఫిర్యాదులందే అవకాశాలున్నాయి. దీనిపైనా విచారణ జరిగితే చర్యలు ఏ రకంగా ఉండనున్నాయన్న గుబులు అధికారుల్లో రేకెత్తుతోంది.

ప్రజాశక్తి www.prajasakti.com

మద్దిలేరు వాగును పరిరక్షించండి

కదిరి టౌన్ : పట్టణంలోని హిందూపూర్ రోడ్డు లో గల మద్దిలేరు వాగును పరిరక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పట్టణంలోని వ్యర్థాలను మద్దిలేరులో కలిపేస్తున్నారని తద్వారా మద్దిలేరు ఆక్రమణకు గురవుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో వాగుకు రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరారు. ఈసందర్భంగా వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సుబ్బిరెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు జగన్మోహన్, రామ్మోహన్, నాగరాజు, కృష్ణా నాయక్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యను మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణం స్పందించి రక్షణ గోడ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంత బాలోత్సవానికి ఆత్మీయ ట్రస్టు చేయూత

ధర్మవరం టౌన్ : ఉమ్మడి జిల్లాకు చెందిన అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించే అనంత బాలోత్సవానికి ధర్మవరానికి చెందిన ఆత్మీయట్రస్టు చేయూతనందించింది. ఈమేరకు బుధవారం ట్రస్టు చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ శెట్టిపి సూర్యప్రకాశిరెడ్డి, అనంత బాలోత్సవ కమిటి నిర్వాహకులు సావిత్రి రూ.20,500 విలువగల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ట్రస్ట్ డైరెక్టర్లు నంగి పరమేశ్వర్ రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

గోనుగుంట్ల గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యేకు లేదు

ధర్మవరం టౌన్ : ధర్మవరం మాజీ ఎమ్మెల్యేగోనుగుంట్ల సూర్యనారాయణ రాజకీయ ప్రస్తానం గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యేకేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి లేదని బీజేపీ నాయకులు విమర్శించారు. పట్టణంలోని గోనుగుంట్ల వ్యక్తిగత కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గోనుగుంట్లపై చేసిన విమర్శలపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డిష్ రాజు, చిగిచెర అరవిందరెడ్డి, తుంపర్తి పరమేశ్, టూరు చంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి-నల్లచెరువు

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లచెరువు మండలానికి చెందిన మహిళా ఉపాధ్యాయినులు ఎస్.రాజేశ్వరి, జ్యోతిశ్వరమ్మలను సన్మానించారు. తనకల్లు మండల విద్యాధికారి లలితమ్మ ఆధ్వర్యంలో వీరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సి.తాహెర్ వలీ, డి.శ్రీనివాసులు, జి.ఆనంద్, రవివర్ధన్ రెడ్డి, ఆజం బాషా, రమేష్, మహబూబ్ బాషా, వేణుగోపాలస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీ పంటనమోదు

నల్లచెరువు : మండల పరిధిలోని తలమర్లవాండ్లపల్లి గ్రామంలో రబీ పంట నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆర్డీవో రాఘవేంద్ర, కదిరి ఎడిఎలు పంటలను పరిశీలించారు. రబీ పంట నమోదును పూర్తి స్థాయిలో నిర్వహించాలని ఆర్డీవో వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భారతి. గ్రామ రైతులు పాల్గొన్నారు.

తెరుచుకున్న సచివాలయం

ప్రజాశక్తి-మడకశిర

రోళ్ల మండలం హొట్టేబెట్ట గ్రామ సచివాలయ భవనానికి సంబంధించి యజమానికి కొంతమేర బాడుగ డబ్బులు చెల్లించడంతో బుధవారం నాడు దానిని తెరిచారు. అద్దె చెల్లించలేదన్న కారణంగా మంగళవారం నాడు సచివాలయానికి తాళం వేసిన విషయం తెలిసిందే. ఇంటి యజమాని హనుమంత రాయప్పకు సచివాలయ అధికారులు కొంత మేర అద్దె డబ్బులు ఇచ్చారు. దీంతో సచివాలయానికి యజమాని తలుపులు తెరిచారు. మిగిలిన అద్దె మొత్తాన్ని కూడా త్వరలో చెల్లించేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతామని పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కదిరి టౌన్

శబరిమల దర్శనం వెళ్లి తిరిగి వస్తూ తమిళనాడు రాష్ట్రం దిండిగల్ జిల్లా సందూర్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరి రూరల్ మండలం చౌటుతండాకు చెందిన అయ్యప్ప భక్తులు ఎం.శ్రీరాములు నాయక్ మరణించాడు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు గాయపడ్డారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్దారెడ్డి బుధవారం నాడు పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అందిన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో పాటు ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.25వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమర్నాథ్ రెడ్డి, జడ్పిటిసి కష్ణానాయక్, వైస్ ఎంపిపి ఆనంద్ నాయక్, సర్పంచులు శ్రీనివాస్ నాయక్, నారాయణ నాయక్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, నారాయణ నాయక్ పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కోడూరు పంచాయతీలో సమస్యలు పరిష్కరించండి : సిపిఎం

చిలమత్తూరు : కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలో నెల్కొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయంలో జరుగుతున్న గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు రామచంద్ర మాట్లాడుతూ కోడూరు బీసీ కాలనీలో వీధిలైట్లుకు మరమత్తులు చేపట్టాలని,సీసీ రోడ్లపై పేరుకు పోయిన మట్టిని తొలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కోడూరు కమిటి కార్యదర్శి రమేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి : కెపిపిఎస్

హిందూపురం : అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలి కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతు బుక్కరాయసముద్రంలో దళితులను కులం పేరుతో దూషించి, అవమానపరచిన కార్యదర్శిని వెంటనే విధుల్లో నుంచి తొలగించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు మధు, తిమ్మయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో కదిరి విద్యార్థుల ప్రతిభ

కదిరి టౌన్ : 23వ జాతీయ స్థాయి స్క్వ్యా మార్షల్ పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. 23వ జాతీయ స్థాయి స్క్వ్యా మార్షల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత ఏడాది డిసెంబర్ 30 నుంచి జనవరి 2వ తేదీ వరకు జమ్మూలోని భగవతినగర్ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం నందు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు 21 రాష్ట్రాల నుంచి సుమారు 3000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా నుంచి 10 మంది విద్యార్థులు లోబో, గ్రూప్ ఖవానికే క్యాటగిరిల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. కదిరి నుంచి 10 మంది విద్యార్థులు 15 విభాగాల్లో పోటీ పడ్డారు. అందులో 9 గోల్డ్, 1 సిల్వర్, 3 బ్రౌన్జ్ మెడల్స్ మొత్తం 13 మెడల్స్‌ను సాధించారు. అండర్ -11 బాలికల గ్రూప్ ఖవానికే విభాగంలో రీదా ముస్కాన్, రిషిత, మనోజ్ఞ సాయి గోల్డ్ మెడల్, అండర్ -11 బాలికల లోబో-21 కేజీల విభాగంలో రీదా ముస్కాన్ గోల్డ్, అండర్-11 బాలుర లోబో ఓపెన్ విభాగంలో మహమ్మద్ కైఫ్ బ్రౌన్జ్, అండర్ -14 బాలికల గ్రూప్ ఖవానికే విభాగంలో నీతిక, రోష్ని, నిహిత గోల్డ్, అండర్ -14 లోబో విభాగంలో నిహిత గోల్డ్, రోష్ని బ్రౌన్జ్, అండర్-14 లోబో-49 కేజీల విభాగంలో అలైహి వసల్లం గోల్డ్, అండర్-18 బాలుర లోబో-64 కేజీల విభాగంలో రంజిత్ బ్రాన్జ్, అబోవ్-18 లోబో 58 కేజీల విభాగంలో చాందిని సిల్వర్ పతకాలను సధించారు. ఈ విద్యార్థులను జిల్లా స్క్వ్యా స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాస్టర్ షాకీర్ అధ్యక్షులు షబ్బీర్, కోశాధికారి ఫజులున్నిసాలు అభినందనలు తెలియజేశారు.

జ్ఞాపికలతో క్రీడాకారులు

ప్రజాసమస్యలు పట్టించుకోని ప్రభుత్వం : టిడిపి

రొద్దం : ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం మండలంలోని కందుకూర్లపల్లిలో బుధవారం స్థానిక టిడిపి నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం లో టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారధి, సవితమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, మండల కన్వీనర్ నరహరి, పెనుకొండ నియోజకవర్గం అధ్యక్షులు చిన్నపయ్య, రొద్దం సర్పంచి అశ్వర్థనారాయణ, చంద్రమౌళి,మాధవనాయుడు, చిన్నపరెడ్డి, మురళి, నాగరాజు, పాల్గొన్నారు.

స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

అమడగూరు : మండల పరిధిలోని గుండు వారి పల్లి, మహమ్మదాబాద్ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాసంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ గోపాల్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

తనకల్లు : మండల పరిధిలోని మల్లిరెడ్డిపల్లి పంచాయతీకి చెందిన మల్లిరెడ్డిపల్లి, ఎర్రబల్లి, పెద్దపల్లి, కురవపల్లి గ్రామాల్లో టిడిపి ఇదేఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో టిడిపి నాయకులు ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అందని వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివద్ధి కుంటుపడిందని చెప్పారు. ఇలాంటి పాలనకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మాజీ ఎంపిపి భూక్యలక్ష్మి, మాజీ మండల కన్వీనర్ శంకర్ నాయుడు, మండల కో కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి, పిజి.మల్లికార్జున, ఎస్సీ సెల్ చిన్నప్ప, రాష్ట్ర ఎస్టీ సెల్ హరి నాయక్, దస్తగిరి వార్డ్ మెంబర్ దామోదర్, ఉత్తన్న నాయక్, సూరి పాల్గొన్నారు.

కదిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జీవో వెనక్కు తీసుకోవాలి

కదిరి అర్బన్ : జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఆ జీవో ప్రతులను స్థానిక అంబేద్కర్ కూడలిలో టిడిపి నాయకులు దహనం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని రోడ్డు మీదకు రానివ్వకుండా జగన్మోహన్ రెడ్డి జీవో నెంబర్ ఒకటిని తీసుకువచ్చి ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తున్నాడని విమర్శించారు. టిడిపి అధికార ప్రతినిధి మనోహర్ నాయుడు ,తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు బాబ్జాన్ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ బాబు, నాగప్ప, నాగముని కుమార్, శేషు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్చుకోలేక జీవో విడుదల చేశారని విమర్శించారు. ఈకార్యక్రమంలో కుటాగుల శంకర, మనోహర్,టిడిపి నాయకులు చంద్రశేఖర్, తేపల్లె మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో అధికారపార్టీకి ఒక న్యాయం. ప్రతిపక్ష పార్టీకి మరొక న్యాయమా అని ఐటీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబునాయుడు సభలు జరగకుండా జగన్ కొత్తగా జీవో తీసుకువచ్చారన్నారు. వైసీపీ నేతలు రోడ్డుపైకి వస్తే నిబంధనలు వర్తించవా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఇర్షాద్, తోటవాసుదేవ, మందలసురేశ్, బొగ్గువినోద్, హరి, గొట్లూరుహరి, ఐటీడీపీ రామ్మోహన్ తదతరులు పాల్గొన్నారు.

లేపాక్షి : జీవో నెంబర్ 1ని రద్దు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఐ మండల కార్యదర్శి శివప్ప ఆధ్వర్యంలో తహశీల్దార్ బాబు కు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణ రెడ్డి, గౌతమ్, మారయ్య, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల వర్తింపులో అన్యాయంపై సచివాలయం ముట్టడి

నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం వల్ల అర్హులకు కొత్త పింఛన్లు మంజూరుకాలేదని 28వ వార్డు కౌన్సిలర్ భర్త సరితాల బాషా ఆధ్వర్యంలో పలువురు బాధితులు బుధవారం స్థానిక 28వ సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అక్కడికి చేరుకున్నారు. అర్హులకు నూతన పింఛన్లు సచివాలయ ఉద్యోగులు మంజూరు చేయలేదని కౌన్సిలర్ భర్త కమిషనర్ మల్లికార్జున ఫిర్యాదు చేశారు. అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు

సంయుక్త కలెక్టర్ కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

మంత్రి ధర్మాన ప్రసాదరావు కమిటీని రద్దు చేయాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

దళితుల పేదల భూములు లాక్కోవడానికి ప్రభుత్వం వేసిన మంత్రి ధర్మాన ప్రసాదరావు కమిటీని రద్దు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న డిమాండ్ చేశాడు. ఈ మేరకు ఆయన బుధవారం జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ దళితులకు పేదలకు ఇచ్చిన భూముల్లో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 6.50 లక్షల ఎకరాలు అన్యాక్రాంతమైందన్నారు. ఇప్పుడు పేదల భూములు లాక్కోవడానికి ప్రభుత్వం కుట్రపన్ని ధర్మాన ప్రసాదరావు కమిటీని వేసిందన్నారు. ఈ కమిటీని తక్షణమే రద్దు చేసి 9/77 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పేదల భూములు లాక్కోవడానికి ఈ కమిటీ సిఫారసు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా పేదల పక్షాన ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పైపల్లి గంగాధర్, బాలస్వామి, వెంకట రాముడు, నారాయణ, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తున్న వైసిపి'

మడకశిర : సభలు, సమావేశాలను నిషేధిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సర్కార్ విడుదల చేసిన జీవో బ్రిటిష్ పాలనను తలపిస్తుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభలు సమావేశాలు నిర్వహించడానికి పోలీస్ యాక్ట్ అమలు చేయడం దుర్మార్గమన్నారు. గతంలో బ్రిటిష్ పాలకులు కూడా ఈ విధంగా చేయలేదని చెప్పారు. చంద్రబాబునాయుడు చేపట్టిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమానికి సంబంధించిన సభలకు వస్తున్న జన వాహిని చూసిన సిఎంకు వెన్నులో వణుకు పుట్టి ఇలాంటి జీవోలు ఇస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి లోకేష్ పాదయాత్రను అడ్డుకోవడానికి, నారా చంద్రబాబు సభలను కట్టడి చేయడానికి ముందస్తుగా ఇలాంటి ప్రణాళిక రూపొందించుకున్నారని విమర్శించారు. .ప్రతిపక్ష పార్టీ నాయకుల సభలు జరిగే చోట పోలీసు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ జీవోను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు .

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి

యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ధర్మవరం టౌన్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలలో యువర్ ఫౌండేషన్ ముందుంటుందని ఆసంస్థ నూతన అధ్యక్షులు వైకే శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని కొత్తపేట శ్రీ ఉషోదయ ఇంగ్లీషుమీడియం పాఠశాలలో యువర్ ఫౌండేషన్ 8వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ నూతన అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు మాట్లాడుతూ 2015లో సంస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టి తక్కువ కాలంలో పేరొందిన సంస్థ పేరు సంపాదించామన్నారు. నేత్రదానం స్వీకరించుటలో ఉమ్మడి జిల్లాలో ముందున్నామన్నారు. అదేవిధంగా విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందించడం లాంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి గురువారం రోగులకు ఉచిత అన్నదానాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కోటేశ్వరరావు, చాంద్‌బాషా, బండ్లపల్లి రంగనాథ్, డాక్టర్ సుబ్బారావు, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పౌండేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. నూతన అధ్యక్షులుగా వైకే శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా రంగం ఆది, కార్యదర్శిగా సుంకుసుమార్, సహాయకార్యదర్శిగా ఖలీల్, కోశాధికారిగా రాధాకృష్ణ, పిఆర్‌ఒగా శీలా నాగేంద్రను ఎంపిక చేశారు

యువర్స్ ఫౌండేషన్ నూతన కార్యవర్గసభ్యులు

మతసామరస్యానికి ప్రతీక బాబయ్య దర్గా

ప్రజాశక్తి పెనుకొండ

చారిత్రాత్మక ప్రాంతమైన పెనుకొండ లోని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన బాబయ్య స్వామి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ప్రతి ఏటా బాబయ్య స్వామి ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మన రాష్ట్రంతో పాటు కర్నాటక తమిళనాడు, కేరళ , మహారాష్ట్ర ,తెలంగాణ రాష్ట్రాల నుంచే కాక దేశ విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. బాబయ్య స్వామి మహోత్సవం వంశపారంపర్యంగా దర్గా పీఠాధిపతి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జరుగుతుంటాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది పెనుకొండ లో బాబయ్య స్వామి దర్గా ఉరుసు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతుంటాయి.

గంధం వేడుకలను ధర్గా నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తూవుంటారు. బాబయ్య స్వామి ఉరుసు సందర్భంగా దర్గా వంశపారంపర్య పీఠాధిపతి తాజ్ బాబా కాబోయే దర్గా పీఠాధిపతి నజర్ హుస్సేన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉద్యోగులకు క్రీడా పోటీలను నిర్వహిస్తారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం ఉంటుంది. అదేవిధంగా తాజ్ బాబా ఆధ్వర్యంలో నిర్వహించే సర్వమత సమ్మేళనంలో వివిధ మత పీఠాధిపతులు హాజరై హిందూ ముస్లిం బేధాలు లేకుండా నేషనల్ ఇంటిగ్రేషన్ సెమినార్‌ను కూడా నిర్వహిస్తారు.

బాబయ్య స్వామి దర్గాను సందర్శించిన కలెక్టర్

బాబయ్య స్వామి దర్గాను జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తిక్ సందర్శించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి తాజ్ బాబా, కాబోయే పీఠాధిపతి సలావుద్దీన్ బాబా ల ఆధ్వర్యంలో ఫకీర్ల విన్యాసాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం సందల్ మహల్ నుండి చాదర్‌ను ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గా సమాధికి సమర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా పెనుకొండ బాబయ్య దర్గా విరజిల్లుతోందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న 750వ వార్షిక గంధము, ఉరుసు ఉత్సవ వేడుకల భాగంగా పీఠాధిపతి తాజ్ బాబా ఆహ్వానం మేరకు రావడం జరిగిందన్నారు. ఎంతో భక్తి విశ్వాసాలతో కుల మతాలకు అతీతంగా ప్రజల నుండి పూజలు అందుకుంటున్న దర్గా ఉత్సవ వేడుకలు జయప్రదం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి తనయుడు సలావుద్దీన్ బాబా నేతత్వంలో అతిథులకు ఆత్మీయ సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణలత, మునిసిపల్ కమిషనర్ వంశీకష్ణ భార్గవ్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ రఫీ, వక్ఫ్ ఇన్స్‌పెక్టర్ ఇమ్రాన్, మస్తాన్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

చాదర్‌ను తీసుకెళుతున్న కలెక్టర్, తదితరులు

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు,కదిరి

O.S.NO:260/2021.

Between:

చిన్నసాని ఆదిలక్ష్మమ్మ మరియు ఇతరులు ...వాదులు

మరియు

M.ఫయాజ్ అహమ్మద్ S/o M.మదార్ సాబ్ టెంపుల్ స్ట్రేట్ Now Residing at D.No:10-326,రహమత్ మసీదు దగ్గర, గజ్జలరెడ్డిపల్లి, కదిరి ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

పై దావాలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తమై 15-03-2023 వ తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు 15-03-2023 వ తేదిన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్నచో తెలుపుకొనవచ్చును. అట్లు కాని ఎడల పై కోర్టు వారు మీ దావాను మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

స్థలం:కదిరి
వాయిదా:15-03-2023

యస్.రామచంద్రారెడ్డి, బి.ఎ., బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి

డాక్యుమెంటు పోయినది

S.K.షంషాద్ తండ్రి:ఖాజామియా, డోర్ నెం:1-1-558-3-1, అమిన్ నగర్ కదిరి (పోస్ట్) కదిరి (మండలం) శ్రీ సత్యసాయి (జిల్లా) అయిన నేను 2 నెలల ముందు కదిరి బస్టాండ్ నుండి ఇంటికి వస్తుండగా నా మోటర్ సైకిల్ నందు ఉంచిన ఇంటి లింకు డాక్యుమెంట్ (దస్తావేజు) పోగొట్టుకున్నాను. ఈ డాక్యుమెంటు నెంబర్ 1-3558/2000 సంవత్సరమునకు సంబంధించినది. ఈ డాక్యుమెంటు ఎవరికైన దొరికిన నాకు అప్పగించగలరు అని కోరుతున్నాము.

P.ASEEF KHAN, Cell:9704404756

అర్హులందరికీ పింఛన్లు



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్, తదితరులు

హిందూపురం : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ ఇక్బాల్ పేర్కొన్నారు. హిందూపురం రూరల్ మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లు అందజేసే కార్యక్రమం బుధవారం పట్టణంలోని ఆర్ కే ఫంక్షన్ హాల్‌లో మండల పరిషత్ అభివద్ధి అధికారి నరేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ పింఛను మంజూరుకు నిర్దేశించిన అర్హతలు ఉంటే దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో అన్నింటిని పరిశీలించి మంజూరు చేస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో 85 శాతం వరకు నెరవేర్చామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, సీనియర్ నాయకులు కొండూరు వేణుగోపాల రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బసిరెడ్డి, బసవన్నపల్లి సర్పంచి భాగ్యమ్మ, నాయకులు పురుషోత్తం రెడ్డి, మండల వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం పింఛన్ వారోత్సవాల్లో పాల్గొన్న తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్, తదితరులు

రొద్దం : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరనారాయణ లబ్ధిదారులకు నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు వైసిపి నాయకులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లును బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గుర్రం వనజ, జెడ్పీటీసీ కోటి సుధ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీవో సాయిమనోహర్, వైస్ ఎంపీపీలు పార్వతి, గజ్జెల వెంగళరెడ్డి, నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి, కరీంసాబ్, సర్పంచు ఆక్కిం కాకమ్మ, ఎంపీటీసీ కోటి నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : నవరత్నాల్లో భాగంగా పింఛను వారోత్సవాల సందర్భంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాసపల్లి సాయికుమార్ తెలిపారు.ఈ మేరకు 9వ,29వ వార్డు సచివాలయాల పరిధిలోని 9వ వార్డులో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాసపల్లి సాయికుమార్, 29వ వార్డులో కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత బాలిరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేశారు.ఈ కారక్రమంంలో కౌన్సిలర్లు మాసపల్లి సాయికుమార్, కోటిరెడ్డి సుజాత బాలిరెడ్డి, 9,29 వార్డ్ సచివాలయాల సిబ్బంది, వాలెటీర్స్, కన్వీనర్లు, పింఛనుదారులు పాల్గొన్నారు.



పింఛను వారోత్సవాల్లో పాల్గొన్న 29వ వార్డు కోటిరెడ్డి సుజాత బాలిరెడ్డి, తదితరులు

లేపాక్షి : స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇక్బాల్ లబ్ధిదారులకు నూతన పింఛన్లనుమ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదల పక్షపాతిగా నిలించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అబ్దుల్‌ఘనీ, నాయకులు కొండూరు వేణుగోపాల్ రెడ్డి, తహశీల్దార్ బాబు, ఎంపీడీవో నరసింహ నాయుడుతో పాటు నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక జీవనజ్యోతి వెలుగు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే పివి. సిద్దారెడ్డి లబ్ధిదారులకు నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఫీ నాయక్. ఎంపీడీవో రామానాయక్, తహశీల్దార్ క్రాంతి కుమార్, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.